

క్రిటికల్‌కేర్‘లెస్’

- జీజీహెచ్‌కు దూరంగా సీసీయూ
- 250 పడకల ఆస్పత్రి భవనంలో మెడికల్ కాలేజీ
- కొత్త క్యాంపస్ నిర్మాణంపై దృష్టిపెట్టని ప్రభుత్వం
- 50 పడకల క్రిటికల్‌కేర్ యూనిట్ నిర్మాణం వృథానేనా..?

8



వావ్.. రెడ్ మూన్!

- ఆకట్టుకున్న సంపూర్ణ చంద్ర గ్రహణం
- ఉమ్మడి జిల్లాలో తిలకించిన జనం

హనుమకొండ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆకాశంలో ఆదివారం అద్భుతం జరిగింది. సంపూర్ణ చంద్రగ్రహణం అందరినీ ఆకట్టుకున్నది. రాత్రి 9.56 గంటలకు ప్రారంభమై అర్ధరాత్రి 1.26 గంటలకు ముగిసింది. మొత్తం 3.30గంటల పాటు ఈ సుదీర్ఘ గ్రహణం సంభవించింది. గ్రహణం సందర్భంగా పూర్తి ఎరుపు రంగుతో రక్త చంద్రుడిగా దర్శనమిచ్చాడు. 2018 తర్వాత భారత దేశంలోని అన్ని ప్రాంతాల్లో కనిపించిన మొదటి గ్రహణం ఇదే. 2022 తర్వాత ఇలాంటి గ్రహణం సంభవించడం ఇదే మొదటి సారి. ఇది రాహుగ్రస్థ సంపూర్ణ చంద్రగ్రహణం అయినందు వల్ల కొన్ని రాశులవారు ఈ గ్రహణాన్ని చూడరాదని పండితులు చెప్పారు. అయినప్పటికీ అదేం లెక్క చేయక వేలాది మంది భవనాలపైకి ఎక్కి, రోడ్ల మీదికి వచ్చి, ఎత్తైన ప్రాంతాలకు వెళ్లి గ్రహణాన్ని ఆసక్తిగా తిలకించడం కనిపించింది. ఈ గ్రహణం

(మిగతా 7లో..)

‘ఉల్లాస్’ంగా సంపూర్ణ అక్షరాస్యత

- మహిళా గ్రూపుల భాగస్వామ్యంతో అక్షరాస్యత కార్యక్రమం



- వయోజన విద్య, విద్యాశాఖ, సెర్ప్, ఓపెన్ స్కూల్ భాగస్వామ్యంతో ఎన్ఐఎల్పీ

నేడు అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం

7



కాళేశ్వరాలయం తూర్పు ద్వారం మూసివేసిన అర్చకులు

ఆలయాల ద్వారబంధనం

మహదేవపూర్/వెంకటాపూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : సంపూర్ణ చంద్రగ్రహణం దృష్ట్యా భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం, ములుగు జిల్లా వెంకటాపూర్‌లోని యూనెస్కో గుర్తింపు పొందిన రామప్ప రామలింగేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం ద్వారబంధనం చేశారు. కాళేశ్వరాలయ ద్వారాన్ని మధ్యాహ్నం 12 గంటలకు అర్చకులు మూసి ఉంచారు. తిరిగి 8వ తేదీ సోమవారం సంప్రోక్షణాది పూజా కార్యక్రమాలు నిర్వ హించనున్నట్లు దేవస్థాన ఈవో మహేష్ తెలిపారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు భక్తులకు దర్శనానికి అనుమతించ నున్నట్లు చెప్పారు. అలాగే రామప్ప రామలింగేశ్వరస్వామి ఆలయాన్ని మధ్యాహ్నం ఒంటి గంటకు మూసివేసినట్లు అర్చకుడు ఉమాశంకర్ తెలిపారు. రాత్రి 9.56 గంటల కు సంపూర్ణ చంద్ర గ్రహణం సంభవించనుండగా పూజాధికాలు నిర్వహించి ఆలయ ద్వారాన్ని మూసివేసినట్లు తెలిపారు. గ్రహణ మోక్షానంతరం ఆలయాన్ని శుద్ధి సంప్రోక్షణధాకాలు చేసి తిరిగి సోమవారం ఉదయం 7గంటలకు ఆలయంలోకి భక్తులను అనుమతిస్తామన్నారు.



రామప్ప ఆలయానికి ద్వారబంధనం చేసిన అర్చకుడు ఉమాశంకర్



- 10 శాతం తగ్గుతుండటంతో ప్రజల్లో హర్షాతిరేకాలు
- బైక్‌లపై రూ.60వేలు, కార్లపై రూ.1.50లక్షల వరకు తగ్గే అవకాశం
- రెండు వారాలు కొనుగోలు వాయిదా వేసుకుంటున్న జనం
- వ్యవసాయ ట్రాక్టర్లు, టైర్లు, పురుగు మందుల ధరలూ తగ్గింపు
- కేంద్రం జీఎస్టీ కొత్త టారిఫ్ ప్రకటనతో గణనీయ మార్పులు
- ఓరుగల్లులో భారీగా తగ్గిన కొనుగోళ్లు

వేచిచూద్దామా?!

ఈ నెల 22 నుంచి అమల్లోకి కొత్త జీఎస్టీ టారిఫ్

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

కేంద్ర ప్రభుత్వం కొత్త జీఎస్టీ టారిఫ్‌లను ప్రకటించటంతో ఓరుగల్లు మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది. ఈ నెల 22వ తేదీ నుంచి అనేక వస్తువులు, వాహనాలపై జీఎస్టీ భారం భారీగా తగ్గుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కొనుగోళ్లను మరోరెండు వారాలు వాయిదా వేసుకుంటున్నారు. ప్రధానంగా వాహనాల కొనుగోళ్లలో హైదరాబాద్ తరువాత రెండోస్థానంలో ఉన్న వరంగల్‌లో.. కొత్త బుకింగ్‌లు భారీగా నిలిచిపోయాయి. సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోలుపై కూడా ప్రభావం కనపడనుంది. వీటితోపాటు వ్యవసాయరంగానికి సంబంధించిన ట్రాక్టర్లు, పురుగు మందులు, నీటిపారుదల శాఖకు సంబంధించిన మోటార్లు, విద్యకు సంబంధించిన పుస్తకాలు, ఇతర వాటిపై కూడా జీఎస్టీ తగ్గింపు ప్రభావం ఉండనుంది. నిత్యావసర వస్తువులపై కూడా జీఎస్టీ తగ్గుతుండటంతో మధ్యతరగతి ప్రజలు సంతోషపడుతున్నారు. ఈ క్రమంలో 22వ తేదీ వరకు కొనుగోళ్లు నెమ్మదించే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇది ఓరుగల్లు మార్కెట్‌పై తీవ్ర ప్రభావం చూపనుంది.

వాహన మార్కెట్‌పై ప్రభావం

కేంద్ర ప్రభుత్వం వివిధ వస్తువులు, వాహనాలు, నిత్యావసర సరుకులపై జీఎస్టీని భారీగా తగ్గించింది. ఈ మేరకు సెప్టెంబరు 3వ తేదీన కేంద్ర ప్రభుత్వం ప్రకటన చేసింది. దసరాకు పది రోజుల ముందు సెప్టెంబరు 22వ తేదీ నుంచే తగ్గించిన కొత్త జీఎస్టీ అమల్లోకి వస్తుందని కేంద్రం ప్రకటించింది. దీంతో అత్యంత వెనుకబడిన జిల్లాగా ఉన్న ఓరుగల్లు ప్రజలకు ఊరట కలుగనుంది. ప్రధానంగా జీఎస్టీల తగ్గింపు ప్రభావం వాహన మార్కెట్‌పై తీవ్రంగా కనిపించనుంది. ప్రభుత్వం సెప్టెంబరు 3న కొత్త జీఎస్టీ శ్లాబులను ప్రకటించటంతో వాహనాలు కొనుగోలు చేయాలనుకునేవారు ఆలోచనలో పడ్డారు. కొత్త జీఎస్టీలో 28శాతం నుంచి 18శాతానికి వాహనాలపై జీఎస్టీని తగ్గించారు. 10శాతం జీఎస్టీ తగ్గుతుండటంతో వాహనాలు కొనుగోలు చేసేవారు మరో రెండువారాలు నిరీక్షించేందుకు సిద్ధమయ్యారు. హైదరాబాద్ తరువాత వాహనాల విక్రయాల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా రెండోస్థానంలో ఉంది. మధ్య తరగతి ప్రజలు అధికంగా వినియోగించే 350 సీసీ లోపు బైకులపై జీఎస్టీని ప్రభుత్వం 28శాతం నుంచి 18శాతానికి తగ్గించింది. పదిశాతం జీఎస్టీ తగ్గుదలతో భారీగా ధరల్లో మార్పు కనిపిస్తుంది. అలాగే 100 సీసీ, ఆపై సామర్థ్యం ఉన్న బైకుల ధర రూ.1లక్షకు పైగా ఉన్నాయి. ఇక ఇటీవల ఎక్కువ క్రేజీ ఉన్న ఎలక్ట్రికల్ బైక్‌ల ధర రూ.30వేల నుంచి రూ.లక్షకుపైగా ఉన్నాయి. వీటిపై కూడా 10శాతం జీఎస్టీ తగ్గుదల ఉంది. ఉమ్మడి వరంగల్ జిల్లాలో

(మిగతా 7లో..)

వ్యవసాయ రంగానికి ఊరట

జీఎస్టీల తగ్గింపు వ్యవసాయరంగానికి కొంత ఊరట కలిగించనుంది. ప్రధానంగా రాష్ట్రంలోనే వ్యవసాయ ఆధారిత జిల్లాగా ఉమ్మడి వరంగల్ జిల్లా మొదటి స్థానంలో ఉంది. వ్యవసాయం యాంత్రీకరణ జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ గతంలో 18శాతం, 12శాతం ఉండగా, ప్రస్తుతం 5శాతానికి తగ్గించారు. దీంతో ట్రాక్టర్లతో వ్యవసాయ సంబంధిత యంత్రాలపై భారీగా తగ్గింపులు రానున్నాయి. దీంతో పాటు పురుగుల మందులపై కూడా జీఎస్టీని 5శాతానికి కుదించారు. దీంతో రైతులకు పురుగుల మందులపై భారీగా లబ్ధిచేకూరనుంది. అలాగే నీటిపారుదల శాఖకు సంబంధించిన వ్యవసాయ మోటార్లు, పైపులు తదితర వాటిపై కూడా జీఎస్టీ 5శాతానికి తగ్గించారు. కొత్త జీఎస్టీతో రైతులకు కూడా భారీగా ఊరట కలిగించనుంది.



షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైన ఇల్లు

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మహదేవపూర్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలోని కుదురుపల్లిలో ఆదివారంచోటుచేసుకుంది. బాధితుడు చల్లా దేవేందర్ ఇంటి వద్దే గర్నీ నడుపుతున్నాడు. రాత్రి కుటుంబ సభ్యులు వెనుక భాగంలోని గుడిసెలో నిద్రిస్తుండగా గర్నీ ఉన్న ఉన్న పెంకుటింటిలో తెల్లారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించింది. చూస్తూ చూస్తుండగానే ఇల్లంతా కాలిపోయింది. విలువైన సామగ్రి, నిత్యావసర సరుకులు దగ్ధమైపోయాయి. దీంతో సుమారు 2లక్షల నష్టం వాటిల్లినట్టు బాధితుడు దేవేందర్ తెలిపాడు.

మేడిగడ్డ బ్యారేజీకి 4.39 లక్షల క్యూసెక్కులు

మహదేవపూర్ రూరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలో నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రవాహం కొనసాగుతోంది.4.39లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా 85గేట్లను ఎత్తి, అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 5.60 మీటర్లు నమోదైంది.



● బొగత వద్ద కోలాహలం

తెలంగాణ నయాగరా బొగత జలపాతం వద్ద ఆదివారం కోలాహలం నెలకొంది. వారాంత సెలవు కావడంతో పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ప్రకృతి అందాలను వీక్షించి మంత్ర ముగ్దులయ్యారు. జలపాతం ముందు భాగంలో ఉన్న ఈత కొలనులో జలకాలాడుతూ మైమరచిపోయారు. హైదరాబాద్, హనుమకొండ, ఖమ్మం, భద్రాచలం, ములుగు, భూపాలపల్లి తదితర పట్టణాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చారు. జలపాతం దృశ్యాలను తమ కెమెరాల్లో బంధించారు.

- వాజేడు, (ఆంధ్రజ్యోతి)

జంపన్నవాగులో యువకుడి మృతి

మేడారం పుణ్యస్నానాలకు వెళ్లి గల్లంతు

తాడ్వాయి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం వనదేవతలను దర్శించుకోవడానికి వచ్చిన యువకుడు పుణ్యస్నానాలకు వెళ్లి జంపన్నవాగులో గల్లంతై మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ప్రత్యక్ష సాక్షులైన తోటి యువకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జనగామ జిల్లా కేంద్రంలోని కురుమవాడ నెహ్రూపార్క్ ప్రాంతానికి చెందిన కనిగంటి మనీష్(25) తన స్నేహితులు 13మందితో కలిసి మేడారం వనదేతలను దర్శించుకోవడానికి వచ్చాడు. ఈ క్రమంలో జంపన్నవాగులో ఊరట్టం కాజ్‌వే వద్ద స్నేహితులతో కలిసి పుణ్యస్నానాలు ఆచరించే సమయంలో ప్రమాదవాశాత్తు నీట మునిగి గల్లంతయ్యాడు. తోటి యువకులు వెంటనే సమాచారం అందించగా సీఐ దయాకర్, ఇన్‌చార్జి తహసీల్దార్ సురేష్, ట్రైనీ ఎస్సై మధుకర్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టారు. వాగు ప్రవాహం ఎక్కువగా ఉండటం వల్ల మనీష్ ఆచూకీ దొరకలేదు. దీంతో ఏటూరునాగారం నుంచి ఎన్డీఆర్ఎఫ్ బృందాన్ని రప్పించారు. రెండు బోట్ల సహాయంతో ఐదు గంటల పాటు గాలింపు చర్యలు చేపట్టగా మనీష్ మృతదేహం లభ్యమైంది. మృతుడు మనీష్ జనగామలోని ఓ కిరాణ షాపులో గుమస్తాగా పనిచేస్తున్నాడు. తండ్రి రాజు మృతి చెందగా తల్లి తారమ్మ, అన్న సందీప్ ఉన్నారు.



మనీష్ మృతదేహాన్ని వెలికితీస్తున్న ఎన్డీఆర్ఎఫ్ బృందం, మనీష్ (ఫైల్)

హెచ్చరిక బోర్డులు లేక..

జంపన్నవాగు వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు అంటున్నారు. మహా జాతరకు మరో 140 రోజుల సమయం ఉంది. ఈ క్రమంలో భక్తులు సమ్మక్క, సారలమ్మలను నేరుగా దర్శించుకోవాలని ముందుగానే మేడారం వస్తున్నారు. వర్షాకాలం దృష్ట్యా జంపన్న వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఎలాంటి హెచ్చరికలు లేకపోవడంతో వాగు లోతును అంతచనా వేయకపోవడం వల్లే పుణ్యస్నానాన్ని ఆచరిస్తూ మనీష్ మృతి చెందాడని తెలుస్తోంది.

తండ్రిపై కత్తెరతో తనయుడి దాడి

భూపాలపల్లి కారల్‌మార్క్స్ కాలనీలో ఘటన

కృష్ణకాలనీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తండ్రిపై తనయుడు కత్తెరతో దాడి చేసి గాయపర్చిన సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలోని కారల్‌మార్క్స్ కాలనీకి చెందిన మంగళంపల్లి నర్సింహామూర్తి సింగరేణి 6ఇన్‌క్లైన్‌లో కార్మికుడిగా పని చేస్తున్నాడు. అతడికి భార్య పుష్ప, ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడు కొన్నేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు. చిన్న కుమారుడు కార్తీక్ కూడా ఇటీవల అనారోగ్య బారిన పడ్డాడు. కిడ్నీల సమస్యతో అతడు బాధపడుతున్నాడు. దీంతో తల్లి పుష్ప ఒక కిడ్నీ దానం చేసింది. అప్పటి నుంచి ఆమె ఆరోగ్యం కూడా సరిగా ఉండటం లేదు. ఇదే క్రమంలో నర్సింహమూర్తి మద్యానికి బానిసై విధులకు సక్రమంగా వెళ్లడం లేదు. దీంతో కుటుంబ అవసరాల తీరడం లేదు. తల్లీకొడుకుల వైద్యానికి కూడా డబ్బులు ఉండటం లేదు. దీంతో తండ్రి నర్సింహమూర్తి, కొడుకు కార్తీక్ మధ్య తరచూ గొడవలు అవుతున్నాయి. ఆదివారం కూడా ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో తండ్రిపై కోపోద్రిక్తుడైన కార్తీక్ పక్కనే ఉన్న కత్తెరతో ఒక్కసారిగా తండ్రిపై దాడి చేశాడు. దవడ కింద భాగంలో కత్తెర బలంగా గుచ్చుకోవడంతో నర్సింహమూర్తికి తీవ్రగాయమైంది.



సింగరేణి ఆస్పత్రిలో నర్సింహమూర్తి

దీంతో భార్య పుష్ప గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గుమిగూడి నర్సింహమూర్తిని ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నర్సింహమూర్తి సింగరేణి ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు నర్సింహమూర్తి భార్య పుష్ప ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై సాంబమూర్తి తెలిపారు.

మానుకోటలో ప్రధాన రహదారుల్లో గోవులు

● ఇబ్బందులు పడుతున్న పాదచారులు, ప్రయాణికులు, వాహనదారులు ● పట్టించుకోని పాలకులు, అధికారులు

మహబూబాబాద్ టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ప్రధాన రహదారులపై గోవులు ఉండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఎక్కడో ఒకచోట గోవులు కనిపించేవి.. అలాంటిది ప్రస్తుతం పట్టణంలో ఎక్కడా చూసిన రోడ్లపై గోవులు దర్శనమిస్తున్నాయి. రాత్రి వేళల్లో ఏకంగా రోడ్లపై పడుకుండడంతో వాహన రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. కొన్ని సందర్భాల్లో వాహనదారులు వాటిని తప్పించబోయి ప్రమాదాలు సంభవించిన సంఘటనలు లేక పోలేదు. ద్విచక్ర వాహనదారులు కింద పడి గాయపడ్డ సంఘటనలు చోటు చేసుకున్నాయి. దినదినాభివృద్ధి చెంది మానుకోట పట్టణం జిల్లా కేంద్రంగా అప్‌గ్రేడ్ కావడంతో జిల్లా కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం నిత్యం రాకపోకలు సాగించే వారి సంఖ్య పెరగడంతో వాహనాల రద్దీ పెరిగింది. ఈ క్రమంలో వాహన రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా ప్రధాన రహదారులను విస్తరించారు. అయినప్పటికి పట్టణంలోని ప్రధాన రహదారులపై అత్యధికంగా గోవులు సంచరించడం, రాత్రి వేళల్లో రోడ్లపై నిద్రించడంతో వాహనరాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

రోడ్లపై ఎక్కడా చూసిన గోవులే..

మహబూబాబాద్ పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ రోడ్, పత్తిపాక రోడ్, తొర్రూరు రోడ్, నర్సంపేట రోడ్, వ్యవసాయ మార్కెట్ రోడ్ ఇలా ప్రధాన రహదారులన్నింటిపై గోవులు సంచరిస్తుండడంతో అనేక ప్రమాదాలు సంభవిస్తున్నాయి. రాత్రి వేళల్లో రోడ్లపై అవి నిద్రించడంతో భారీ వాహనాలు నెమ్మదిగా పక్క నుంచి పోవాల్సి వస్తుంది. కొన్ని సందర్భాల్లో రోడ్డు మధ్యలో ఉండడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో పాటు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీనికి తోడు చిరు వ్యాపారులు రోడ్ల వెంట తోపుడ బండ్లపై పండ్లు, కూరగాయలు,విక్రయిస్తూ జీవనోపాధి పొందుతుండంగా రోడ్ల వెంట ఉంటున్న గోవులు పండ్లు, కూరగాయలు సైతం లాక్కుని తింటుండడంతో చిరు వ్యాపారులు సైతం నష్ట పోతున్నారు. మరో పక్క ప్రజా ప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వాహనాల్లో వేగంగా వెళ్లాలన్న



మహబూబాబాద్‌లోని తొర్రూరు బస్‌స్టాప్ వద్ద ప్రధాన రోడ్డుపై ఉన్న గోవులు

రోడ్లపై గోవులుండడంతో అనుకున్న సమయానక చేరుకోలేక పోతున్నారు. ఉదయం, సాయంత్రం, రాత్రి ఇలా అన్ని వేళల్లో గోవులు రోడ్లపై కన్పిస్తున్నాయి. అధికారులు చొరవ చూపి రోడ్లపై ఉంటున్న గోవులను యాజమానులకు అప్పగించడం లేదా గోశాలకు తరలించి ఇబ్బందులను తొలగించాలని వాహనదారులు, ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



సత్యనారాయణ (ఫైల్)

నెల్లికుదురు, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై నుంచి పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మండలంలోని బ్రాహ్మణకొత్తపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్సై సీహెచ్ రమేష్‌బాబు కథనం ప్రకారం ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన ఆరెందుల సత్యనారాయణ (60) దాట్ల గ్రామానికి తన బంధువుల ఇంటికి వెళ్లి తిరిగివస్తున్న క్రమం లో బ్రాహ్మణకొత్తపల్లి గ్రామానికి చేరుకోగానే ద్విచక్రవాహనం అదుపు తప్పి కిందపడిపోవడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికుల వెంటనే 108లో మహబూబాబాద్ ఏరియా ఆస్పత్రి తరలించారు చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య జయమ్మ ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుమారుడు ఆరేందుల ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టు మార్టానికి తరలించినట్లు ఎస్సై రమేష్‌బాబు పేర్కొన్నారు.

చికిత్సపొందుతూ బాలిక మృతి

● గడ్డి నివారణ మందు తాగి ఆత్మహత్య

ఇనుగుర్తి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : ఇనుగుర్తి మండలంలో ఓ బాలిక గడ్డి నివారణ మందు తాగి చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిసింది. డిగ్రీ ఫస్టియర్ చదువుతున్న బాలిక శనివారం మధ్యాహ్నం ఇంటి వద్ద గడ్డి నివారణ మందు తాగగా ఆమెను మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఆమె మృతికి కారణాలు తెలియాల్సి ఉంది.

మేడారంలో భక్తుల సందడి

- 10వేల మందికి పైగా తరలివచ్చిన భక్తులు



సమ్మక్క గద్దె వద్ద పూజలు చేస్తున్న భక్తులు

తాడ్వాయి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఆదివారం సందడి నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులు వనదేవతలు సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవడానికి భారీ సంఖ్యలో వచ్చారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టల్లో తలనీలాలు సమర్పించారు. తల్లులకు జేజేలు పలుకుతూ గద్దెకు చేరుకున్నారు వనదేవతల గద్దెల వద్ద ఎత్తుబంగారం, చీరె, సారె, పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు సమర్పించారు. తమ కోరికలు నెరవేర్చాలని వేడుకున్నారు. అనంతరం మేడారం పరిసరాల్లో చెట్ల కింద, వసతి గృహల్లో విడిది చేసి బంధుమిత్రులతో విందు భోజనాలు చేశారు. సుమారు 10 వేల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకున్నారని అధికారులు తెలిపారు.

కృతజ్ఞత సభకు తరలి రావాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్సీ ఉప కుల సంఘాల నేతలు

కాటారం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఉపకులాల ఆధ్వర్యంలో ఈనెల 10న ములుగులో నిర్వహించే కృతజ్ఞతా సన్మాన సభకు అధిక సంఖ్యలో తరలి రావాలని పలు కుల సంఘాల ప్రతినిధులు కోరారు. భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని అంబేద్కర్ కూడలిలో ఆదివారం సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ75 ఏళ్ల స్వాతంత్ర్య భారతదేశంలో అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న కులాలకు ఎస్సీ వర్గీకరణ కోరే హక్కు ఉందని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఇచ్చిందన్నారు.

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడం హర్షణీయమన్నారు. దీంతో తమ కల నేరవేరిందని ఎస్సీ ఉప కులాల ఆధ్వర్యంలో కృతజ్ఞతా సన్మానసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమ కన్వీనర్ గడ్డం వెంకటేశ్వర్లు, కో కన్వీనర్లు గడ్డం రమేష్ చంద్ర, గడ్డం పున్నంచందర్, చిందు హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం తిరుపతి, యక్షగాన కళాకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నీలకంఠం, చిందు, బేడబుడగ జంగం, డెక్కలి కుల సంఘాల జిల్లా, మండల నాయకులు గడ్డం లక్ష్మయ్య, సంజీవ్, కేదారి, ప్రభాకర్, కరుణాకర్, శ్రీనివాస్, టేకం రాజయ్య, పర్వతాలు, రమ, రవళి, కర్నెకంటి గోపాల్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌పై దాడి చేసిన ముగ్గురిపై కేసు

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విధుల్లో ఉన్న కానిస్టేబుల్‌పై దాడి చేసిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సుబేదారి సీఐ ఎం.రంజిత్‌కుమార్ ఆదివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ అదాలత్ సెంటర్‌లో శనివారం కానిస్టేబుల్ అశోక్ విధులు నిర్వర్తిస్తున్నాడు. అక్కడ ట్రాఫిక్ మళ్లిస్తుండగా హనుమకొండకు చెందిన కంప వినోద్ తన బైక్ అడ్డుగా పెట్టాడు. బైక్‌ను ఆపినందుకు కానిస్టేబుల్ అశోక్‌పై వినోద్.. రాజ్‌కుమార్, రాజుతో కలిసి దాడి చేశారు. ఈ విషయాన్ని కానిస్టేబుల్ అశోక్ పోలీసుస్టేషన్‌కు ఫోన్ చేసి చెప్పడంతో మరో ఇద్దరు కానిస్టేబుళ్లు అక్కడికి చేరుకున్నారు. అక్కడ ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లుతో కలిసి దాడిచేసిన ముగ్గురిని సుబేదారి పోలీసుస్టేషన్‌కు తరలించారు. కానిస్టేబుల్ అశోక్ ఫిర్యాదు మేరకు ఎస్సై సుమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. కాగా, గతంలో కూడా కంప వినోద్ రోడ్డుపై న్యూసెన్స్ చేసి పోలీసులను ఇబ్బందులకు గురిచేయడంతో అతడిపై కేసు ఉన్నట్లు పేర్కొన్నారు.

ఎంజీఎంలో గాడితప్పిన పాలన

సూపరింటెండెంట్ సెలవుపై వెళ్లడంతో ఇబ్బందులు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉత్తర తెలంగాణలో పేదల ఆస్పత్రిగా ప్రసిద్ధికెక్కిన ఎంజీఎం ఆస్పత్రిలో పాలన గాడితప్పుతోంది. కొన్నేళ్లుగా ఎంజీఎం ఇన్‌చార్జి పాలనలోనే నడుస్తోంది. దీంతో పాలన పడకేస్తోందని సిబ్బంది, ప్రజలు అంటున్నారు. ప్రస్తుతం ఎంజీఎం ఆస్పత్రిలో ఓపీ చిట్టీలు, చివరికి బ్యాండేజ్‌లు కూడా లేని పరిస్థితి దాపురించింది.

గత నెల 28వ తేదీ నుంచి ఈ నెల 12వ తేదీ వరకు ప్రస్తుత ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్ సెలవుల్లో వెళ్లారు. దీంతో పరిపాలనా బాధ్యతలను డాక్టర్ చిలుక మురళికి అప్పగించారు. అయితే జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి ఆగ్రహంతోనే సూపరింటెండెంట్ సెలవుల్లోకి వెళ్లినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. దీంతో తిరిగి విధుల్లో చేరుతాడా? లేదా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే వ్యక్తిగత కారణాలతోనే సెలవులో వెళ్లారని మరికొందరు చెబుతున్నారు. కాగా, సూపరింటెండెంట్ డాక్టర్ కిశోర్ పనితీరు పట్ల కలెక్టర్ సత్యశారద కూడా తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల జరిగిన ఓ సమీక్ష సమావేశంలో పూర్తిస్థాయి సూపరింటెండెంట్ కోసం ప్రభుత్వానికి లేఖ రాయనున్నట్లు వెల్లడించారు.

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల విలవిల

ఎంజీఎం సూపరింటెండెంట్ కిశోర్ సెలవుపై వెళ్లడంతో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అవస్థలు పడుతున్నారు. కొద్ది రోజులుగా బిల్లులు చెల్లించకుండా జాప్యం చేస్తూ వస్తున్నారని కన్నీటి పర్యంతం అవుతున్నారు. దసరా పండగ వరకైనా తమ వేతన బకాయిలు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అదే విధంగా సీనియర్ సిటిజన్లు, ప్రభుత్వ ఉద్యోగుల రీయింబర్స్‌మెంట్ బిల్లులు కూడా కుప్పలు తెప్పలుగా ఉన్నట్లు తెలుస్తోంది.

రౌడీషీటర్‌పై కేసు నమోదు

● మిల్స్‌కాలనీ పీఎస్‌లో పలు సెక్షన్‌లు
● ఆంధ్రజ్యోతి కథనానికి స్పందన

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి): రౌడీషీటర్ వంచనగిరి సురేశ్ అలియాస్ కోతి సురేశ్‌పై మిల్స్‌కాలనీ పోలీసుస్టేషన్‌లో పలు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేశారు. ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో 'గణపతి ఊరేగింపులో రౌడీషీటర్ వీరంగం' అనే వార్త ప్రచురితమైంది. ఈ కథనానికి పోలీసులు స్పందించారు. కరీమాబాద్‌లోని రామస్వామి గుడి వీధిలో జరిగిన దాడిలో పాల్గొన్న రౌడీషీటర్ అనుచరుడిని ఆదివారం అదుపులోకి తీసుకున్నట్లుగా విశ్వసనీయమైన సమాచారం. దాడిచేసిన రౌడీషీటర్ పరారీలో ఉండటంతో ప్రత్యేక బృందాలు గాలిస్తున్నట్లుగా తెలుస్తోంది. బాధితుల ఫిర్యాదుతో రౌడీషీటర్ సురేశ్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులపై 118 (1), 296 (బి), ఆర్‌బైడబ్ల్యూ 3(5) బీఎన్ఎస్ సెక్షన్‌ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, కేసు నమోదు కావడంతో రాజీ కోసం తన అనుచరులను బాధితుల ఇంటికి పంపుతూ వేధిస్తున్నట్లుగా సమాచారం.

పలు ఘర్షణల్లో..

కరీమాబాద్‌లో జరిగిన గొడవ రోజే మండిబజార్‌తో పాటు కరీమాబాద్‌లో మరికొంత మందితో రౌడీషీటర్ సురేష్ ఘర్షణపడ్డట్టుగా సమాచారం. ప్రతీ సారి ఏదో వివాదంలో తలదూర్చి దాడులకు తెగబడి రెండు మూడు నెలలు కనిపించకుండాపోయి కొంత మంది ప్రజాప్రతినిధుల మధ్యవర్తిత్వంతో పోలీసులకు లొంగిపోవడం ఆయనకు షరా మామూలైనట్లుగా తెలుస్తోంది. ఓ రాజకీయ నాయకుడి పేరు చెప్పి బాధితులను బెదిరింపులకు గురిచేస్తున్నట్లు తెలుస్తోంది.

లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉమ్మడి వరంగల్ అధ్యక్షుడిగా ప్రశాంత్

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సత్తా ఉద్యమ సంస్థ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్‌గా సుంకరి ప్రశాంత్‌ను నియమించినట్లు లోక్ సంస్థ ఉద్యమ సంస్థ తెలంగాణ రాష్ట్ర సమన్వయ కర్తలు పర్సా కోదండరామారావు, బండారు రామ్మోహన రావు ఆదివారం తెలిపారు. సుంకరి ప్రశాంత్ అవినీతి వ్యతిరేక సంస్థ జ్వాల ఏర్పాటు చేసి అవినీతి వ్యతిరేక కార్యక్రమాలు నిర్వహించారు. లోక్ సత్తా ఉద్యమంలో విద్యార్థి దశ నుంచి పాల్గొంటూ ఉమ్మడి జిల్లాలో రెండు దశాబ్దాలుగా క్రియాశీలకంగా వ్యవహరించారు. లోక్‌సత్తా జిల్లా, రాష్ట్రస్థాయి యువజన విభాగంలో కీలక పదవులు నిర్వహించాడు.

సమస్యల పరిషారానికి డాక్ అదాలత్

హనుమకొండ టౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రజలు తపాలాశాఖ సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు తీసుకునేందుకు 51వ డాక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆదివారం జిల్లా తపాలాశాఖ అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. సెప్టెంబరు 8లోపు తపాలాశాఖలో వివిధ సమస్యలను పోస్టల్ డిపార్ట్‌మెంట్‌కు ప్రజలు పంపించాలని అన్నారు. పోస్టల్ కవర్‌లో కె.శ్రీకాంత్, అసిస్టెంట్ డైరెక్టర్ (స్టాఫ్ అండ్ విజిలెన్స్) పోస్టుమాస్టర్ జనరల్ హైదరాబాద్ రీజియన్ 500001కు కవర్‌పై 51వ డాక్ అదాలత్ అని రాసి పంపించాలని కోరారు. డాక్ అదాలత్ 2025 సెప్టెంబరు17న ఉదయం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గుగుల్ మీట్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

గురుకులాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే



విద్యార్థినుల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గండ్ర

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గణపురం మండలం గాంధీనగర్‌లోని మహాత్మాజ్యోతి బాపులే గురుకులాన్ని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గురుకులానికి ప్రహరీ నిర్మించాలని, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, గ్రౌండ్ లెవలింగ్ చేయాలని, బెంచీలు, డైనింగ్ హాల్ సమకూర్చాలని ఎమ్మెల్యేను విద్యార్థినులు కోరారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యార్థులు, యువత భవిష్యత్ కోసం కృషి చేస్తున్నారని అన్నారు. ఈ క్రమంలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆహారం అందిస్తున్నారని అన్నారు. మెస్, కాస్మెటిక్ చార్జీలను కూడా పెంచినట్లు గుర్తుచేశారు. విద్యార్థినులు బాగా చదువుకొని ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆయన వెంట స్థానిక కాంగ్రెస్ నాయకులు, తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గుంజేడు ముసలమ్మ జాతరలో పూర్వ స్నేహితులు

కొత్తగూడ, సెప్టెంబర్ 7 (ఆంధ్రజ్యోతి) : కొత్తగూడ మండలం గుంజేడులోని శ్రీముసలమ్మ దేవాలయంలో ఆదివారం పూర్వవిద్యార్థుల సమ్మేళనంను ఘనంగా నిర్వహించుకున్నారు. వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని బుధరావుపేట పాఠశాలలో 1988-89 సంవత్సరంలో 7వ తరగతి వరకు చదువుకున్న స్నేహి తులు గుంజేడు ముసలమ్మ సన్నిధిలో కలుసుకుని ఆనందంగా గడిపారు. అందులో అమెరికాలో స్థిరపడిన ఇద్దరు స్నేహితులు అలూరి ప్రసాద్‌రెడ్డి, బిక్కి గిరిబాబుకు పూర్వ స్నేహితులు ఘనంగా స్వదేశాగమనం స్వాగతం పలికారు. కార్యక్రమంలో బి.వెంకటనారాయణ, కె.వెంకటనారాయణచారి, ఎ.కృష్ణ, బి. యశ్వంత్‌రెడ్డి, ఎన్.రమేష్, డి.నర్సయ్య చారి, కోరె సుధాకర్, బి.వేణు, ఎం. శ్రీని వాస్, పి.శ్రీనివాసు, బత్తిని శ్రీనివాస్, తండ వెంకన్న, బి.బిక్షపతి, కె.కర్ణ పాల్గొన్నారు.

పారిశుధ్యం ఏదీ..?!

● ఇళ్ల మధ్య కంపుకొడుతున్న కాసారాలు
● చెత్తా చెదారంతో దర్శనమిస్తున్న వాడలు

కాటారం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా కాటారం మండలకేంద్రం సహా పలు గ్రామాల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. చెత్తాచెత్తచెదారం, ప్లాస్టిక్ బాటిల్స్, పాలిథీన్ కవర్స్‌తో డ్రెయినేజీలు నిండి కంపుకొడుతున్నాయి. రోడ్లపై ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య లోపం వల్ల సీజనల్ వాధుల బారిన పడుతున్నారు. మండల కేంద్రమైన కాటారం గ్రామపంచాయతీ పరిధిలో ప లు చోట్ల ఇళ్ల మధ్యనే లోతట్టు ప్రాంతాల్లో మురికినీరు చేరి కంపు కాసారాలుగా మారాయి. మండల కేంద్రం శివారు ప్రాంతమైన ఇబ్రహీంపల్లి జీపీ పరిధిలోనూ ఇళ్ల మధ్య ఉన్న లోతట్టు ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోయి, డ్రెయినేజీలు సరిగా లేక మురికి నీరు నిలిచిపోతోంది. మండల కేంద్రంలో వ్యాపారులు, ప్రజలు ప్లాస్టిక్ బాటిల్స్ పాలిథీన్ కవర్లు, ఇతర పాడైన వస్తువులను డ్రెయినేజీలో పడేస్తున్నారు. పలు జీపీల్లోనూ



గారెపల్లిలో ఇళ్ల మధ్య మురుగునీరు, చెత్తాచెదారం

పారిశుధ్య నిర్వహణ సరి గా లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ట్రాక్టర్లకు డీజిల్ లేక చెతను డంపి ంగ్ యార్డులకు తరలించని పరిస్థితి ఉంది. జీపీల ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడం, గ్రామపంచాయతీల్లో డబ్బులు లేవని కార్యదర్శులు చేతులెత్తేయడంతో గ్రామాల్లో ఇబ్బందిగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలతో పారిశుధ్యలోపం స్పష్టంగా కనిపిస్తూ సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలని ప్రజలు కోరుతున్నారు.

చంద్రగ్రహణంతో వీరభద్రస్వామి ఆలయం ద్వార బంధనం



శ్రీ వీరభద్రస్వామి దేవాలయంలో గర్భగుడి తలుపులను ద్వారబంధనం చేస్తున్న అర్చకులు

కురవి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) :చంద్రగ్రహణంతో కురవి భద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయాన్ని మధ్యాహ్నం వ ఎూ సి వే శా ర ఎ. మధ్యాహ్నం వరకు పూజాకార్యక్రమాలు పూర్తి చేసి ఒంటి గంట సమయంలో ఆలయ అర్చకులు ద్వార బంధనం చేశారు. చంద్రగ్రహణం ఉంది అని తెలియని భక్తులు ఆలయానికి వచ్చి మూసిఉండడంతో నిరాశగా వెనుదిరిగారు. సోమవారం ఉదయం 5 గంటలకు సంప్రోక్షణ పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం 6 గంటల నుంచి స్వామివారి దర్శనానికి అనుమతి ఉంటుందని ఆలయ కార్యనిర్వహణ అధికారి సత్యనారాయణ తెలిపారు.

బంగారు ఆభరణాలపై కన్నేసి హత్య

● ఉల్లేపల్లి మహిళ హత్య కేసును ఛేదించిన మరిపెడ పోలీసులు ● బైక్, బంగారు ఆభరణాలు సీజ్ ● నిందితుడి అరెస్ట్

మరిపెడ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : బంగారు ఆభరణాలపై కన్నేసిన ఓ తాపీ మేస్త్రీ ఉల్లేపల్లికి చెందిన ఓ మహిళ (గుత్తమేస్త్రీ)ని హత్య చేసిన ఘటనను మరిపెడ పోలీసులు వారంలోపే ఛేదించారు. అపరిచిత పరిచయంతోనే ఆ మహిళ దారుణ హత్యకు గురయింది. ఈ హత్య వివరాలను తొర్రూరు డీఎస్పీ కృష్ణకిశోర్ ఆదివారం మరిపెడ పీఎస్‌లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వెల్లడించారు. డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఉల్లేపల్లికి చెందిన బంటు వెంకమ్మ (55) గుత్త మేస్త్రీగా పని చేస్తూ, ఈ నెల 1న ఇదే మండలం పురుషోత్తమాయగూడెం శివారులో హత్యకు గురైయ్యింది. సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం వాయాల సింగారానికి చెందిన సాగాల వీరన్న తాపీ మేస్త్రీగా పనిచేసేటోడు. వెంకమ్మ గుత్త మేస్త్రీ కావడంతో ఊరూరా వ్యవసాయ కూలి పనుల కోసం తనవద్ద ఉన్న కూలీలను రైతుల వ్యవసాయ అవసరాల కోసం కూలీ పనుల కోసం తీసుకెళ్లేది. ఈ క్రమంలో సాగాల వీరన్నకు ఆమెతో పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం చాల చనువుగా మారింది. వెంకమ్మను వీరన్న తన బైక్‌పై రైతుల వద్దకు తీసుకెళ్లి కూలీ పనులు మాట్లాడుకొని మళ్లీ ఆమెను ఇంటి వద్ద దించి వెళ్లేటోడు. దీంతో వారిద్దరి మధ్య ఆర్థిక సంబంధాలు మెరుగైనవి. అప్పుడప్పుడు వీరన్నకు వెంకమ్మ డబ్బులు అప్పుగా, బదులుగా ఇచ్చేది. ఆగస్టు 31న వీరన్న వెంకమ్మను రూ. 3వేలు కావాలని ఫోన్ చేసి అడుగగా రేపు మరిపెడ బంగ్లాకు బ్యాంక్ పనిమీద వస్తున్న అక్కడికి రా డబ్బులు ఇస్తానని చెప్పడంతో వీరన్న సెప్టెంబరు 1న మరిపెడబంగ్లాకు వచ్చి వేరేటోళ్ల ఫోన్‌తో వెంకమ్మకు ఫోన్ చేసి కలుసుకున్నారు. స్థానిక వైన్స్‌షాపులో బీర్లు కొనుగోలు చేసి వీరన్న బైక్‌పై ఆమెను ఎక్కించుకొని ఖమ్మం జిల్లా పాతర్లపాడు మీదుగా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం శివార్లో కూర్చోని మాట్లాడుకుందామని చెప్పి బైక్ అపి వీరన్న ఆమెను డబ్బులు అడుగగా రూ.2వేలు ఇచ్చింది. ఇవి సరిపోవు ఇంకో వెయ్యి ఇవ్వుమని అడగడంతో తన వద్ద ఇంతే ఉన్నవని మళ్లీ ఎప్పుడైనా కలిసినప్పుడు ఇస్తానని చెప్పడంతో ఆయన మనస్సంతా ఆమె బంగారంపై మళ్లీ బీర్లు తాగినంకా మాట్లాడుకుందామని తను తాగుతూ ఆమెను తాగమని బలవంత పెట్టాడు. ఇద్దరు బీర్లు తాగుతూ మాట మాట పెరిగింది. ఆమె మెడపై ఉన్న పుస్తెలతాడు, నల్లపూసల గొలుసు లాక్కుకునే ప్రయత్నం చేస్తుండగా వెంకమ్మ ప్రతిఘటించింది. తలపై బీరు బాటిల్‌తో కొట్టడంతో స్పృహతప్పిపడింది. బీరు బాటిల్‌తో మళ్లీ మెడపై



నిందితుడి అరెస్ట్ చూపుతున్న తొర్రూరు డీఎస్పీ కృష్ణ కిశోర్



నిందితుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

పొడిచి చంపేశాడు. స్కార్ఫ్ మెడకు చుట్టి పక్కనే ఉన్న నీళ్ల గుంతలో పడేసి బైక్‌పై అక్కడి నుంచి పారిపోయారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లా కాకరవాయి వద్ద బైక్ అదుపుతప్పి పడిపోగా స్థానికులు గుర్తించి 108 సహాయంతో ఆస్పత్రికి తరలించారు. ఆ మహిళా హత్య మిస్టరీ ఛేదించడానికి మరిపెడ పోలీసులు వారి సాంకేతికతను ఉపయోగించి నిందితుడిని ఆదివారం పట్టుకొని విచారించగా హత్య విషయం ఒప్పుకున్నారు. పోలీసులు అతని వద్ద నుంచి 4తులాల బంగారు అభరణాలు, బైక్ స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మరిపెడ సీఐ రాజ్‌కుమార్, ఎస్సై సతీశ్‌గౌడ్, పోలీస్ సిబ్బంది రమేశ్, స్వామి, వేణు, మహేశ్, సందీప్ (డ్రైవర్), రమ్య, శాంతను డీఎస్పీ అభినందించారు.

ఉల్లాస్‌ంగా సంపూర్ణ అక్షరాస్యత



- మహిళా గ్రూపుల భాగస్వామ్యంతో అక్షరాస్యత కార్యక్రమం
- వయోజన విద్య, విద్యాశాఖ, సెర్ప్, ఓపెన్ స్కూల్ భాగస్వామ్యంతో ఎన్ఐఎల్పీ
- నేడు అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నవభారత్ సాక్షరత (New India Literacy Program - NILP) కార్యక్రమంలో భాగంగా 'సమాజంలోని అందరికీ జీవితకాల అభ్యాసం యొక్క అవగాహన' (Understanding of Life long Literacy for All in Society-ULLAS) ద్వారా నిర్దేశిత లక్ష్యాలను చేరేందుకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నవభారత్ సాక్షరత అధికారులు సమాయత్తం అవుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వయోజన విద్య, విద్యాశాఖ, సెర్ప్, ఓపెన్ స్కూల్ భాగస్వామ్యంతో జిల్లాల్లో పూర్తి స్థాయిలో అక్షరాస్యత సాధించేందుకు ప్రణాళికలు రూపొందించారు. సెప్టెంబరు 8న అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనం.

మహిళా గ్రూపుల సహకారంతో..

అందరినీ అక్షరాస్యులను తీర్చిదిద్దేందుకు ఈ సారి నవభారత్ సాక్షరత మిషన్ వినూత్న కార్యక్రమాన్ని రూపొందించింది. డీఆర్డీఏలోని సెర్ప్ విభాగం మహిళా స్వయం సహాయక సంఘాలను భాగస్వామ్యం చేసింది. గ్రామాల్లోని మహిళా సంఘాల పరిధిలో నిరక్షరాస్యులను గుర్తించి వారిని అక్షరాస్యులు చేసేందుకు మహిళా సంఘాలు కీలకపాత్ర పోషించనున్నాయి. క్షేత్ర స్థాయిలో ఎంపిక చేసిన మహిళా సంఘాల సభ్యులు సంబంధిత గ్రామం, యూనిట్‌లో నిరక్షరాస్యులు ఎంత మంది ఏ స్థాయిలో ఉన్నారో గుర్తించి వారికి అవసరమైన కార్యక్రమాన్ని సంబంధిత వారు సంబంధిత అధికారులకు నివేదిస్తారు. ఈ నివేదిక ఆధారంగా ఎవరెవరికి ఎలాంటి ప్రోగ్రాం అందించాలో నిర్ధారిస్తారు.

నాలుగు విభాగాల భాగస్వామ్యం

నవ భారత సాక్షరత కార్యక్రమం నాలుగు విభాగాలను భాగస్వామ్యం చేసి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు ఉమ్మడి జిల్లా ప్రాజెక్టు అధికారి పూర్తి స్థాయిలో దృష్టి సారించారు. నవభారత్ సాక్షరత కార్యక్రమంలోని వయోజన విద్య, జిల్లా విద్యాశాఖలు, స్వయం సహాయక మహిళా సంఘాలు, ఓపెన్ స్కూల్ విభాగాలను భాగస్వామ్యం చేశారు.

సంపూర్ణ అక్షరాస్యత సాధనకు..

ఉమ్మడి జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యతకు వయోజన విద్య అధికారులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించారు. క్షేత్ర స్థాయిలో మహిళా సంఘాల సభ్యులు నిరక్షరాస్యులు, వివిధ కారణాలతో మధ్యలో చదువు మానేసిన వారిని గుర్తిస్తారు. పూర్తి నిరక్షస్యరాస్యులకు శిక్షణ పొందిన మహిళా సంఘాల సభ్యులతో వయోజన విద్య కార్యక్రమాన్ని అందిస్తారు. ఇక అనివార్య కారణాలతో 10, ఇంటర్ మధ్యలో మానేసిన వారిని గుర్తించి వారిని ఓపెన్ స్కూల్ ద్వారా ఓపెన్ టెన్త్, ఇంటర్ పూర్తి చేయించేందుకు విద్యాశాఖతో పాటు వయోజన విద్య అధికారులు కృషి చేస్తారు. నవ భారత్ సాక్షరత మిషన్ ద్వారా పూర్తి స్థాయిలో అందరిని అక్షరాస్యులుగా తీర్చి దిద్దనున్నారు.

పూర్తయిన శిక్షణ

ఉమ్మడి జిల్లాను సంపూర్ణ అక్షరాస్యత జిల్లాగా మార్చేందుకు నవ భారత్ సాక్షరత కార్యక్రమం అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకుంటుంది. ఇప్పటికే జిల్లా స్థాయి, మండల స్థాయి, గ్రామ/యూనిట్ స్థాయిలో ఎంపిక చేసిన మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమం పూర్తి చేసింది. అధికారికంగా కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు అన్ని చర్యలు పూర్తి చేశారు. మరికొద్ది రోజుల్లోనే అందరిని అక్షరాస్యులను చేసే బహత్తర కార్యక్రమం ఉమ్మడి జిల్లాలో ప్రారంభం కానుంది.

సాధించాల్సిన లక్ష్యాలు..

వయోజన విద్య ద్వారా ఉమ్మడి జిల్లాలోని విభజిత జిల్లాల్లో లక్ష్యాలను నిర్దేశించారు. 2025 - 26 సంవత్సరంలో లక్ష్యాలను చేధించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకొని ముందుకు సాగుతోంది.

2011 జనాభా లెక్కల ప్రకారం..

జిల్లా పేరు	అక్షరాస్యత శాతం
వరంగల్	71.90
హనుమకొండ	76.17
జనగామ	61.44
ములుగు	62.26
జయశంకర్ భూపాలపల్లి	58.98
మహబూబాబాద్	57.13

అన్ని విభాగాల భాగస్వామ్యంతో పూర్తి చేస్తాం..



నవ భారత్ సాక్షరత కార్యక్రమం ద్వారా ఉమ్మడి జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధిస్తామనే విశ్వాసం ఉంది. నాలుగు విభాగాల భాగస్వామ్యంతో అందరి సహకారంతో ప్రణాళికత బద్ధంగా ముందుకు సాగుతున్నాం. ఇప్పటికే శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేశాం. క్షేత్ర స్థాయిలో అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అన్ని జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో పూర్తి స్థాయిలో ఏర్పాట్లు పూర్తి చేశారు. త్వరలోనే ఉమ్మడి జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత కార్యాచరణ ప్రారంభం అవుతుంది.

తుమ్మ రమేష్‌రెడ్డి, ఉమ్మడి జిల్లా వయోజన విద్య ప్రాజెక్టు అధికారి

జిల్లా పేరు	నిర్దేశిత లక్ష్యం (వేలల్లో)
వరంగల్	29,739
హనుమకొండ	28,904
జనగామ	24,137
ములుగు	7,581
జయశంకర్ భూపాలపల్లి	29,484
మహబూబాబాద్	35,764

సాంస్కృతిక, సామాజిక చైతన్యమూర్తి అనిశెట్టి రజిత

» రజిత యాది సభలో సాహితీవేత్తలు » నివాళులర్పించిన ప్రముఖులు



అనిశెట్టి రజిత చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీవేత్తలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 7 (ఆంధ్ర జ్యోతి): ప్రముఖ రచయిత్రి, సామాజిక కార్యకర్త, ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక జాతీయ అధ్యక్షురాలు అనిశెట్టి రజయిత యాది సభను వరంగల్ సాహిత్య, సామాజిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో జరిగింది. ఆదివారం కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో అనిశెట్టి రజిత చిత్రపటానికి పూలమాలలలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వివిధ సాహిత్య, ప్రజా సంఘాల సంస్థల ప్రతినిధులు, కవులు, రచయితలు, కళాకారులు మాట్లాడారు. సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి రజిత రచనలు చేసిందన్నారు. హేతువాదిగా, స్త్రీవాదిగా, ఉద్యమకారిణి రజిత చేసిన పోరాటం ఎందరికో అనుసరణీయమని అన్నారు. అక్షరాన్ని జీవితంగా బతికిందన్నారు. వితంతు వ్యవస్థపై గ్రంథాలను రాసి కార్యాచరణ రూపొందించి చైతన్యపరచడంతో పాటు సామాజిక మార్పే లక్ష్యంగా పనిచేశారని చెప్పారు. రజిత తన మరణాంతరం కేఎంసీకి అవయవదానం చేసి కాళోజీ బాటలో నడిచారని కొనియాడారు. రజిత మరణం సాహిత్యలోకానికి తీరని లోటని చెప్పారు.

యాది సభకు కన్వీనర్‌గా బూర భిక్షపతి వ్యవరించగా బిల్లా మహేందర్, నిర్వాహకులు నిధి, కొమర్రాజు రామలక్ష్మి, డాక్టర్ శంకర్ నారాయణలతోపాటు ఆయా సంస్థల ప్రతినిధులు, సభ్యులు ఉద్యమ మిత్రులు, ఉపాధ్యాయులు తిరుణగిరి దేవకిదేవి, పల్లేరు వీరాస్వామి, మెటుట రవీందర్, డాక్టర్ చంద్రభాను, కొడం కుమారస్వామి, జుపాకసుభద్ర, మానస ఎండ్లూరి, తమ్మెర రాధిక, నెల్లుట్ల రమాదేవి, వీఆర్ విద్యార్థి, పి.చందూ, గూడూరు సీతామహాలక్ష్మి, సిగరాజు, రామాదేవి, బిట్ల అంజనీదేవి, శైలజ, విద్యాదేవి, చందనాల సుమిత్రదేవి, వల్లంపట్లనాగేశ్వర్‌రావు, బండారి సుజాత, కల్యాణి కుంజ, డాక్టర్ తాళ్లపల్లియాకమ్మ, కాజీపేట పురుషోత్తం, వెంగల్‌రెడ్డి, శంకర్‌రావు, పిట్ట సాంబయ్య, దండ్రె రాజమౌళి, శోభారమేశ్, వకులవాసు, కీర్తిపతాక, బి.రమాదేవి, డాక్టర్ ఏరుకొండ నర్సింహ్మాస్వామి, శ్యామల, కుమారస్వామి, డాక్టర్ వసంత తదితరులు పాల్గొన్నారు.

వేచి చూద్దామా..?!

5వ పేజీ తరువాయి

ప్రతీనెల సుమారుగా 5వేల పైగా బైకులు విక్రయాలు జరుగుతున్నాయి. ఈ లెక్కన ద్విచక్రవాహనాలపై కనిష్టంగా రూ.6వేల నుంచి గరిష్టంగా రూ.25వేల వరకు ధరలు తగ్గనున్నాయి. దీంతో ప్రతీనెల బైకులపై గరిష్టంగా సుమారు రూ.12.50కోట్ల వరకు వినియోగదారులకు పన్ను తగ్గింపుతో లబ్ధిచేకూరే అవకాశం ఉంది. అలాగే డీజిల్, పెట్రోల్, ఎలక్ట్రికల్ కార్లపై కూడా జీఎస్టీ ప్రభావం తీవ్రంగానే ఉంది. ప్రతీనెల ఉమ్మడి వరంగల్ జిల్లాలో సుమారు 600 నుంచి వెయ్యి వరకు ఆయా సీజన్‌లను బట్టి అమ్ముడుపోతున్నాయి. కార్లపై కూడా 28శాతం జీఎస్టీని 18శాతానికి తగ్గించారు. 10శాతం జీఎస్టీ తగ్గుదలతో కార్లపై కనిష్టంగా రూ.60వేల నుంచి రూ.1.50లక్షల వరకు ధరలు తగ్గనున్నాయి. ఈ లెక్కన కార్లపై నెలకు రూ.6కోట్ల నుంచి రూ.15కోట్ల వరకు జీఎస్టీ తగ్గింపుతో కొనుగోలుదారులకు లబ్ధిచేకూరే అవకాశం ఉందని అంచనా. మొత్తంగా జీఎస్టీ తగ్గింపుతో ప్రతీఏటా బైకులు, కార్ల కొనుగోళ్లపై సుమారుగా రూ.100కోట్ల నుంచి రూ.150కోట్ల వరకు వినియోగదారులపై భారం జీఎస్టీ తగ్గనుంది. ఈ మేరకు జీఎస్టీ రూపంలో ప్రభుత్వానికి ఆదాయం తగ్గనుంది. మొత్తానికి జీఎస్టీ తగ్గుదలతో వాహనరంగంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది.

కేంద్రం ప్రకటనతో ప్రస్తుతం షోరూముల్లో బుకింగ్‌లు భారీగా తగ్గిపోయాయని నిర్వాహకులు పేర్కొంటున్నారు. వాహనాలు కొనుగోలు చేయాలనుకునే వారు మరో రెండు వారాలు ఆగితే తగ్గింపు ధర లభిస్తుందనే ఆశతో ఉన్నారు. అయితే కొనుగోలుదారులను ఆకర్షించేందుకు షోరూమ్ నిర్వాహకులు కొత్త ఆఫర్లను ప్రకటిస్తున్నారు. ముందుగా బుకింగ్ చేసుకుని 22వ తేదీ తరువాతే డెలివరీ చేసుకోవచ్చునని ప్రకటిస్తున్నారు. కొన్ని కంపెనీలు 22వ తేదీ నాటికి వర్తించే జీఎస్టీనే తీసుకుంటామని హామీ ఇస్తున్నారు. దీంతో ముందస్తుగా బుకింగ్‌పై కొనుగోలుదారులు అయోమయంలో పడిపోతున్నారు. మరోవైపు సెకండ్ హ్యాండ్ వాహనాలపై కూడా జీఎస్టీ తగ్గింపు తీవ్ర ప్రభావం చూపనుంది. హైదరాబాద్, కరీంనగర్ తరువాత సెకండ్ హ్యాండ్ వాహనాల అమ్మకంలో వరంగల్ మూడోస్థానంలో ఉంది. అయితే జీఎస్టీల తగ్గింపుతో సెకండ్ హ్యాండ్ వాహనాల కొనుగోళ్లు భారీగా నిలిచి పోయాయి. బైకులు, కార్లపై 10శాతం తగ్గింపు వస్తుండటంతో పాటు దసరా, దీపావళి ఆఫర్లను ఆయా కంపెనీలు ప్రకటిస్తుండటంతో చాలామంది కొత్త వాహనాల వైపు మొగ్గు చూపుతున్నారు. దీంతో సెకండ్‌హ్యాండ్ మార్కెట్ తీవ్ర నష్టాల వైపు చూస్తుందని నిర్వాహకులు వాపోతున్నారు.

మరికొన్నింటిపై తగ్గింపు

అధిక ధరలతో ఆందోళన చెందుతున్న సామాన్యులకు కేంద్రం సవరించిన జీఎస్టీ భారం ఊరట కలిగిస్తుంది. ప్రధానంగా వస్తు సేవా పన్నుల కౌన్సిల్ ప్రతిపాదించిన విధానంలో కొత్తగా జీఎస్టీ మూడు స్లాబ్‌లుగా విభజించారు. పాత విధానంలో ఉన్న 12శాతం, 28శాతం స్లాబులను పూర్తిగా తీసివేస్తూ.. 5శాతం, 18శాతంతో పాటు విలాసవంతమైన వాటిపై 40శాతం జీఎస్టీని చేర్చుతూ కొత్త సంస్కరణలను కేంద్రం తీసుకువచ్చింది. పేదలకు ఊరట కలిగించేలా నిత్యావసర వస్తులపై పన్నుల భారాన్ని భారీగా తగ్గించింది. ప్రధానంగా హెయిర్ ఆయిల్, షాంపులు, నెయ్యి, చీజ్, నామ్కిన్లు, వంట పాత్రలు, తదితర వాటిపై ఉన్న 12శాతం, 18శాతం జీఎస్టీని తగ్గించి 5శాతం జీఎస్టీ స్లాబ్‌లో చేర్చారు. అలాగే ఆరోగ్య, జీవిత బీమాలపై గతంలో 18శాతం ఉన్న జీఎస్టీని పూర్తిగా తొలిగించి, జీరో జీఎస్టీగా మార్చటం కూడా ప్రజలకు ఊరట కలిగించేవే. అలాగే ఆరోగ్యానికి సంబంధించిన డయాగ్నస్టిక్ కిట్లు, గ్లూకోమీటర్లు, కళ్లద్దాలు కూడా జీరో జీఎస్టీ పరిధిలోకి రావటం మధ్య తరగతి ప్రజలకు భారీ ఊరటగా చెప్పుతున్నారు. అలాగే విద్యకు సంబంధించిన మ్యాప్‌లు, పుస్తకాలు, క్రేయాన్‌లు, ఎరేజర్‌లు తదితర విద్య, విద్యార్థులకు సంబంధించిన వాటిపై గతంలో ఉన్న 5శాతం, 12శాతం జీఎస్టీని పూర్తిగా తొలగించి, జీరో జీఎస్టీ పరిధిలోకి తీసుక రావటం పేద విద్యార్థులకు ఊరట కలిగించే అంశం. ఇక వీటితో పాటే అనేక ఎలక్ట్రికల్ ఉత్పత్తులతో పాటు ఇతర నిత్యావసర వస్తువులపై భారీగా జీఎస్టీ తగ్గింపులు చేస్తుండటంతో 22వ తేదీ కోసం కొనుగోళదారులు ఎదురు చూస్తున్నారు.

కాళోజీ కళాక్షేత్రాన్ని అందరికీ అందుబాటులోకి తెస్తా..

మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ » నేత్రపర్వంగా కాకతీయ కళా పురస్కారాలు

హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అనేక వ్యయప్రయాలకోర్చి కోట్లాది రూపాయలతో ప్రజాకవి కాళోజీ పేరిట నిర్మించిన కాళోజీ కళాక్షేత్రాన్ని కళాకారులు, కవుల సమావేశానికి నామమాత్రపు ధరలో అందుబాటులోకి తెచ్చేందుకు తనవంతుగా కృషి చేస్తానని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ హామీ ఇచ్చారు. ఆదివారం కాళోజీ కళాక్షేత్రం వేదికగా శాంతికృష్ణ సేవాసమితి ఆధ్వర్యంలో నేత్రపర్వంగా మూడున్నర గంటల పాటు నిర్వహించిన కాకతీయ కళావైభవం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సేవా సమితి చైర్మన్ డాక్టర్ వంగాల శాంతికృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. కాళోజీ కళాక్షేత్రాన్ని కళాకారులందరూ తమ కార్యక్రమాలు నిర్వహించుకునేందుకు వీలుగా తాను కృషి చేస్తానన్నారు.

తెలుగు అకాడమీ పూర్వ కార్యదర్శి డాక్టర్ తెన్నేటి సుధ మాట్లాడుతూ.. డాక్టర్ విద్వాన్ సుబ్బారావు కూతురిగా, ప్రసిద్ధ రచయిత్రిగా పేరుగడించిన క్రమంలో అదంతా ఈ ఓరుగల్లు మట్టి చలువేనని కాళోజీతో తన సాన్నిహిత్యాన్ని నెమరువేసుకున్నారు. విశిష్ట అతిథిగా హైదరాబాద్‌కు చెందిన వంశీ ఆర్ట్ థియేటర్స్ వ్యవస్థాపకుడు శిరోమణి వంశీ రామరాజు మాట్లాడుతూ.. అంతర్జాతీయ ప్రమాణాలతో కవులకు, కళాకారులకు గుర్తింపు తెచ్చేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్న శాంతికృష్ణను అభినందించి సత్కరించారు. గాయత్రి పీఠాధిపతి శ్రీకాంతాచార్యస్వామి జ్యోతి వెలిగించి ప్రారంభించిన ఈ కార్యక్రమంలో రామడుగు నర్సింహస్వామి, రాష్ట్ర అర్చక సమాఖ్య అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ, ఈగ మల్లేశం, గట్టు మహేశ్‌బాబు, హైదరాబాద్ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నాయకుడు పద్మాకర్ రావు తదితర అనేక మంది ప్రముఖులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంపటి శ్రావణి శిష్యులు, హైదరాబాద్‌కు చెందిన పద్మజా శిష్య బృందం విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



పురస్కారం పొందిన వారు



కాకతీయ కళా వైభవం కార్యక్రమంలో మాట్లాడుతున్న బండా ప్రకాశ్

పురస్కారాలు అందుకున్న ప్రముఖులు

ప్రముఖ నవలాకారుడు అంపశయ్య నవీన్, ఆర్య వైశ్య జాతీయ నాయకుడు గట్టు మహేశ్ బాబు, అర్చక సమాఖ్య నేత గంగు ఉపేంద్ర శర్మ, ఆచార్య బన్న అయిలయ్య, పొట్లపల్లి శ్రీనివాసరావు, ఆచార్య తిరుపతయ్య, డాక్టర్ ఘంటశాల గుజ్జారి రమేశ్, డాక్టర్ గడ్డం వెంకన్న, కళాకారిణి పద్మజ, సయ్యద్ మగ్దూం, బాలాజీ రవీందర్, పల్లె నాగేశ్వర్‌రావు, డాక్టర్ అడ్లూరి వెంకటేశ్వర్లు, చక్రవర్తుల శ్రీనివాస్, సురేశ్, రోజా శ్యామ్, రంగస్థల కళాకారులు ఓడపల్లి చక్రపాణి, ఆకుల సదానందం, సీతాల రఘువేందర్, కళా రాజేశ్వర్‌రావు, జడల శివ, చొల్లేటి కృష్ణమాచార్య తదితరులకు కాకతీయ పురస్కారాలు అందుకున్నారు.

శాస్త్రీయ విద్యా విధానం కావాలి

- ప్రజల్లో మూఢ విశ్వాసాలను రూపుమాపాలి
- జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి భిక్షపతి



చంద్ర గ్రహణాన్ని వీక్షిస్తున్న రామంచ భిక్షపతి

కేయూక్యాంపస్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): శాస్త్రీయ విద్యా విధానంతో ప్రజల్లో మూఢనమ్మకాలను రూపుమాపాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి రామంచ భిక్షపతి అన్నారు. ఆదివారం రాత్రి చంద్రగ్రహణం సందర్భంగా కేయూ స్కాలర్లు, డీవైఎఫ్ఐ, జనవిజ్ఞాన వేదిక సంయుక్తంగా 'ఖగోళంలో అరుదైన సంఘటలు' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. కేయూ గెస్ట్‌హౌస్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గ్రహణం సందర్భంగా అందరు కలిసి భోజనాలు చేశారు. చంద్రగ్రహణాన్ని ప్రత్యేక పరికరాలతో వీక్షించారు. మూఢనమ్మకాలను పారదోలాలని నినదించారు.

ఈ సందర్భంగా జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు, జేవీవీ నేత రాజు, వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్‌లు మాట్లాడారు. వర్సిటీల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించాలని అన్నారు. ప్రజలలో మూఢనమ్మకాలను పారదోలేందుకు కృషి చేయాలని అన్నారు. సైన్స్ అభివృద్ధి చెందితేనే సమాజం అభివృద్ధి సాధ్యం అవుతుందని అన్నారు. దేశంలో ఎక్కువ జనాభా ఉందన్నారు. మూఢనమ్మకాలపై ప్రజలను చైతన్యం చేయడంతో వర్సిటీలు ముందుండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ నీహెచ్. ప్రణయ్‌కుమార్, అజయ్‌కుమార్, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దొగ్గెల తిరుపతి, వేడపల్లి నవీన్, పీడీఎస్‌యూ సెక్రటరీ మర్రి మహేశ్, బీఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల మనోహర్, మంద శ్రీకాంత్, కామగోని శ్రావణ్, స్వేరోస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయిమార్, చిరంజీవి, శివతో పాటు ఎస్ఎఫ్ఐ, ఇతర ప్రజా సంఘాలు, విద్యార్థి సంఘాల కందికొండ తిరుపతి, గోవర్ధన్, రోనాల్డ్ తదిరులు పాల్గొన్నారు.

గ్రహణ వీక్షణానికి టెలీస్కోపులేవి?

- రీజనల్ సైన్స్ సెంటర్‌లో మూలనపడ్డ వైనం
- పట్టింపులేని ప్రభుత్వాలు



వరంగల్‌లోని రీజనల్ సైన్స్ సెంటర్


వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని ప్రాంతీయ సైన్స్ కేంద్రం అలంకారప్రాయంగా ఉంటోంది. నిధుల కేటాయింపుల లేకపోవడంతో సైన్స్ సెంటర్‌లోని చాలా పరికరాలు పాడైపోయి నిరుపయోగంగా పడి ఉన్నాయి. పరికరాల అలా పడి ఉంటే భవన సముదాయం శిథిలావస్థలోకి చేరింది. రీజనల్ సైన్స్ సెంటర్‌లో ఉన్న మూడు టెలిస్కోపులు పనిచేయకుండా పాడైపోయి ఉన్నాయి. గత ఏడాది వరకు మూడింటిలో ఒకటి పనిచేయగా, ఇప్పుడది కూడా పాడై పోవడంతో సైన్స్ సెంటర్ నిర్వాహకులు గ్రహణ వీక్షణానికి ఏర్పాట్లు చేయలేదు. దీంతో నగరంలోని సైన్స్ అభిమానులు సైన్స్ సెంటర్ నిర్వహణ పట్ల అసహనం వ్యక్తం చేస్తున్నారు. అయితే నిధుల లేమితోనే పరికరాల మరమ్మతులు చేపట్టలేకపోతున్నట్లు తెలుస్తోంది. దీంతో ఆదివారం చంద్రగ్రహణ వీక్షణం సైన్స్ సెంటర్ వేదికగా కాలేకపోయింది. ఇప్పటికైనా రీజనల్ సైన్స్ సెంటర్‌ను అలంకార ప్రాయంగా కాకుండా ఉపయోగపడే విధంగా సైన్స్ సెంటర్‌ను రూపుదిద్దాలని కోరుతున్నారు.

వావ్.. రెడ్ మూన్!

5వ పేజీ తరువాయి

వల్ల ఎలాంటి రేడియేషన్ ఉండదని చెప్పడంతో చాలామంది ఈ అరుదైన అద్భుతాన్ని తిలకించేందుకు ఉత్సాహం చూపారు. ఎటువంటి రక్షణ పరికరాలు లేకుండానే వీక్షించారు. పలువురు బైనాక్యులర్లను వినియోగించారు. అపార్టుమెంట్లలో నివసించే వారు కుటుంబసభ్యులతో భవనం పైకి ఎక్కి గ్రహణాన్ని వీక్షించారు. ఇళ్లలోనివారు బయటకు వచ్చి ఆకాశంలోని అద్భుతాన్ని ఆసక్తిగా గమనించారు. చంద్రుడు ఎర్రగా మారే మొత్తం దశ రాత్రి 11.01 నుంచి 12.23గంటల మధ్య 82 నిమిషాల పాటు కొనసాగింది. సూర్యుడు, చంద్రుడికి మధ్య భూమి రావడంవల్ల ఎక్కువ తరంగధైర్ఘ్యం కలిగిన కాంతి వాతావరణంలోకి చెల్లాచెదురుగా వెళ్లడంతో చంద్రుడు ఇలా బ్లడ్ మూన్‌గా కనిపించాడు.

నెల్లుట్ల రమాదేవికి కాళోజీ పురస్కారం



హనుమకొండ కల్చరల్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కాళోజీ పురస్కారం రచయిత్రి నెల్లుట్ల రమాదేవికి దక్కింది. ప్రజాకవి కాళోజీ నారాయణరావు స్మారకంగా ఏటా ఆయన జయంతి అయిన సెప్టెంబరు 9న ప్రదానం చేయనున్న ప్రతిష్ఠాత్మక అవార్డును ఆదివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. అందెశ్రీ అధ్యక్షతన ప్రభుత్వం నియమించిన కాళోజీ అవార్డు కమిటీ.. రమాదేవిని ఎంపిక చేసింది. జనగామ జిల్లా స్టేషన్ ఘన్‌పూర్ శివునిపల్లికి చెందిన రమాదేవి.. ఆంధ్రాబ్యాంకు అధికారిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. ప్రవృత్తి రీత్యా ఆమె కార్టూనిస్టు కాక అనేక పుస్తకాలను వెలువరించి ఓరుగల్లు సాహిత్యరంగంలో తన పేరును సుస్థిరం చేసుకున్నారు. 2011లో మనస్సు భాష సాహిత్యాన్ని ప్రకటించిన ఆమె.. తన సాహిత్య ప్రతిభతో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం సినారే సాహిత్య పురస్కారంతోపాటు అనేక అవార్డులు పొందారు. ఈనెల 9న సాయంత్రం 6గంటలకు హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ప్రత్యేక కార్యక్రమంలో ప్రభుత్వం పక్షాన మంత్రులు జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌లు ఆమెను రూ.లక్ష నగదుతో కాళోజీ పురస్కారాన్ని అందచేస్తారు. కాగా, కాళోజీ పురస్కారం పొందిన రమాదేవిని వరంగల్ ఎంపీ కడియం కావ్యతో పాటు పలువురు అభినందించారు.

వర్షాకాలం పాములతో పైలం



నల్లబెల్లి, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో రైతన్నలు పాములతో చాలా జాగ్రత్తగా ఉండాలి. వర్షాకాలం ప్రారంభం కాగానే పొలం గట్లలపై నీటి మడుగుల వద్ద, గడ్డి మొక్కలు ఉన్న ప్రాంతాల్లో అపరిశుభ్రంగా ఉండే ప్రాంతాలు, కుంటలు, పశువులు, పాకలు, గడ్డివాములు, ఉండే ప్రాంతాల్లో విష సర్పాలు, విషపు పురుగులు ఎక్కువగా సంచరిస్తూ ఉంటాయి. వర్షానికి పుట్టలోంచి వరద నీరు చేరడంతో అవి బయటకు ఎక్కువగా వస్తుంటాయి. వానాకాలంలో పాముకాటు బారిన పడిన వారి సంఖ్య ఎక్కువగా ఉంటుందని రైతులు అంటున్నారు. వర్షాకాలంలో రైతులు ఎక్కువగా జాగ్రత్తలు తీసుకోవలసిన అవసరం ఉంది. రైతులు వ్యవసాయ పంట చేనుల వద్దకు ఉదయం, రాత్రి వేళలనే తేడా లేకుండా వెళుతుంటారు. పొలాల, పొదల మధ్యన పాములు ఎక్కువగా సంచరిస్తుంటాయి. రాత్రి సమయాల్లో పొలాల్లో తిరిగి వారు చాలా జాగ్రత్తగా ఉండాలి.

విష సర్పాల గుర్తించడం ఇలా..

నాగుపాము, తాచుపాము, రక్త పింజర, కట్లపాము, తెట్టెపురుగు, తేళ్ల, జెర్రిలు అత్యంత విషపూరితమైనవి. విష సర్పాలు కాటు వేసినట్టయితే ఆలస్యం చేయకుండా చికిత్స కోసం దవాఖానాకు వెళ్లాలి. నాగుపాము, తాచుపాము, కట్లపాము కాటువేస్తే విషం నేరుగా నాడీ వ్యవస్థ మీద, ఊపిరితిత్తుల మీద పని చేస్తోంది. హృదయ స్పందన ఆగి మనిషి అక్కడిక్కడే మృతి చెందడం జరుగుతుంది. రక్తపింజర విషం ఎక్కువగా రక్త నాళాలపై ప్రభావం చూపుతుంది. రక్తనాళాలు చిట్లీ నోటి నుంచి రక్తం వస్తుంది. రక్త నాళాల్లో రక్త ప్రసరణ ఆగిపోతుంది. రక్తం గడ్డ కట్టడం వల్ల కాటుకు గురైన వ్యక్తి మృతి చెందుతాడు. పాము కాటు వేసిన చోట రెండు గాట్లు పడినట్టుయితే అది విషసర్పం కాటుగా గుర్తించాలి. అంతకంటే ఎక్కువ గాట్లు పడితే అది సాధారణ పాముగా గుర్తించాలి.

పాము కాటుకు ప్రథమ చికిత్స ఇలా..

పాముకాటుకు గురైన వ్యక్తి ఆందోళన చెందకుండా ఉండాలి. అతని పక్కన మరొక వ్యక్తి ఉండి ధైర్యం చెప్పాలి. పాము కాటు వేసిన పై భాగంలో వెంటనే తాడుతో లేదా గుడ్డతో కొంత శరీరాన్ని రక్తం ఆడకుండా బిగించి కట్టాలి. గాయం చేసి రక్తం కారనివ్వాలి. పాము కాటుకు గురైన వ్యక్తిని నడిపించడం కానీ, పరుగులు పెట్టించడం కానీ చేయకూడదు. అలాగే పాము కాటుకు గురైన వ్యక్తిని నిద్ర పోకుండా చూసుకొని, కదిలించకుండా తక్షణమే దవాఖానాకు తరలించాలి. అంతేకాక, పాము కాటు గాయాన్ని కడగడం గాని, ఐస్ పెట్టడం గాని చేయకూడదు.



ప్రకృతి సోయగం



ప్రకృతి తన సహజ సౌందర్యంతో కనులవిందు చేసింది. ఆదివారం సాయంసంధ్యవేళ.. ఎర్రని ఆకాశం, పచ్చని పొలాలు, కొండల నడుమ అస్తమిస్తున్న సూర్యుడు, తమ తమ గూడుకు చేరుకుంటున్న పక్షులు.. ఇలా ఒకే కాన్వాస్‌పై గీచిన మనోహర చిత్రంలా ఆవిష్కరించింది. ఈ దృశ్యం వాజేడు మండలం జగన్నాథపురం వైజంక్షన్ వద్ద చూపురులను ఎంతగానో ఆకట్టుకుంది. దీన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- వాజేడు (ఆంధ్రజ్యోతి)

విడదీయని బంధం



ఆ రెండు జీవులు జాతి వైరాన్ని మరిచాయి. పరస్పర ఆత్మీయంగా మెలుగుతున్నాయి. మంగపేట మండలం కమలాపురం వడ్డెరకాలనీలో వీధి కుక్క, కోతి పిల్ల మధ్య ఆప్యాయత చూపురులను ఎంతగానో ఆకట్టుకుంటోంది. రెండింటి మధ్య ఉన్న చెలిమి ఆశ్చర్యానికి గురిచేస్తోంది. కుక్క, కోతి పిల్ల ఒకదాన్ని విడిచి మరొకటి ఉండలేకపోతున్నాయి. కోతి పిల్లను కుక్క తన వీపుపై ఎక్కించుకొని తిరిగే అరుదైన దృశ్యం ముచ్చటగొల్పుతోంది.

- మంగపేట (ఆంధ్రజ్యోతి)

జాతీయ మాల మహానాడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా రాజన్న



కాటారం, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జాతీయ మాల మహానాడు మంథని నియోజకవర్గ ఇన్‌చార్జిగా మండల కేంద్రానికి చెందిన కందుగుల రాజన్న నియమితులయ్యారు. జాతీయ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ ఆదేశాల మేరకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ నియామక పత్రం జారీ చేశారు. రాజన్నకు రాష్ట్ర ఉపాధ్యక్షుడు నూకల బానయ్య నియామక పత్రాన్ని ఆదివారం అందించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించే ఆందోళన కార్యక్ర మాలను విజయవంతం చేయాలని కోరారు.

కోటంచ వైభవం ఉట్టిపడేలా అభివృద్ధి

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కోటంచ ఆలయ స్వాగత తోరణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

రేగొండ, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి) : కోటంచ లక్ష్మీనరసింహస్వామి ఆలయ వైభవం ఉట్టిపడేలా అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. మండల కేంద్రంలో చిట్యాల రహదారిలో నిర్మించిన కోటంచ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ స్వాగత తోరణాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ కోటంచ ఆలయ స్వాగత తోరణ నిర్మాణానికి రూ.10లక్షలు వెచ్చించామన్నారు. భక్తులు కూడా తమకు తోచిన సహాయం అందించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. దేవాలయాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఇంకా మరెన్నో పనులు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ కిష్టన్న, పీఏసీఎస్ చైర్మన్ విజ్జన్‌రావు, ఆలయ చైర్మన్ భిక్షపతి, ఈవో మహేష్, రాష్ట్ర నాయకులు ఎన్ఎస్ఆర్ సంపత్‌రావు, కాంగ్రెస్ రేగొండ మండల అధ్యక్షుడు నర్సయ్య, రేగొండ టౌన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు ఎడ్ల మల్లారెడ్డి, సీనియర్ నాయకులు మనోహర్‌రెడ్డి, పున్నం రవి, పట్టెం శంకర్, గండి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ లెస్

- జీజీహెచ్‌కు దూరంగా సీసీయూ
- 250 పడకల ఆస్పత్రి భవనంలో మెడికల్ కాలేజీ
- కొత్త క్యాంపస్ నిర్మాణంపై దృష్టిపెట్టని ప్రభుత్వం
- 50 పడకల క్రిటికల్‌కేర్ యూనిట్ నిర్మాణం వృథానేనా..



నిర్మాణంలో ఉన్న క్రిటికల్ కేర్ యూనిట్ భవనం

భూపాలపల్లి కలెక్టరేట్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వైద్య ఆరోగ్య శాఖ పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. వైద్య సౌకర్యాలు ఎన్ని సమకూరుతున్నా నిర్వహణలో మాత్రం నిర్లక్ష్యం కనిపిస్తోంది. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)కు దూరంగా క్రిటికల్‌కేర్ యూనిట్‌ను కట్టడమే దీనికి నిదర్శనం.

భూపాలపల్లి జిల్లాగా 2016లో ఆవిర్భావించాక ఇక్కడ వైద్య సౌకర్యాలు ఒక్కొక్కటిగా మెరుగుపడుతూ వస్తున్నాయి. ఒకప్పుడు ఈ ప్రాంత ప్రజలకు చిట్యాల, మహదేవపూర్ సీహెచ్‌సీలే పెద్దదిక్కు. అంతకు మించి వైద్యం పొందాలంటే వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి వెళ్లాల్సి వచ్చేది. భూపాలపల్లి జిల్లా ఆవిర్భావించాక అధునాతన వైద్య సౌకర్యాలు అందుబాటులోకి వస్తున్నాయి. నీతి ఆయోగ్ గుర్తించిన అత్యంత వెనుకబడిన జిల్లాల్లో భూపాలపల్లి కూడా ఉండటంతో కేంద్ర సంస్థలు సైతం జిల్లాకు నిధులను మంజూరు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం 2023లో ప్రభుత్వం మెడికల్ కాలేజీని మంజూరు చేసింది. కేంద్రం కూడా 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. అయితే.. ప్రభుత్వ ఆస్పత్రికి అనుబంధంగా ఉండాల్సిన క్రిటికల్‌కేర్ యూనిట్ తాత్కాలికంగా మెడికల్ కాలేజీ వద్ద నిర్మాణం జరుగుతుండటం విస్మయం కలిగిస్తోంది. దీంతో క్రిటికల్‌కేర్ యూనిట్ భవితవ్యం ప్రశ్నార్థకమేననే అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది.

50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్

జిల్లాకు 250 పడకల ఆస్పత్రితో 50 పడకల క్రిటికల్ కేర్ యూనిట్ (సీసీయూ)ను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రూ. 23 కోట్లతో భవనం నిర్మాణం చేపట్టడంతో పాటు సిబ్బంది నియమాకం చేపట్టాల్సి ఉంటుంది. అలాగే వైద్యపరికరాలు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. 2024లో సీసీయూ జిల్లాకు మంజూరు కాగా 2025 మొదట్లో పనులు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు దాదాపు 50శాతం పనులు పూర్తయ్యాయి. 2026 జూన్ కల్లా పనులు పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇది మనుగడలోకి వస్తే అత్యవసర వైద్యం అంది ఎంతో మంది ప్రమాణాలను కాపాడొచ్చు. ముఖ్యంగా ఆర్థోపెడిక్, న్యూరోసర్జన్, జనరల్ సర్జన్, అనస్థీషియా, ఎమర్జెన్సీ మెడిసన్ తదితర నిపుణులతో పాటు మిగిలిన వైద్యులు అందుబాటులో ఉంటారు. ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడిన వారిని, అగ్ని ప్రమాదానికి గురై ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని, ఏదైనా ఆపరేషన్ పూర్తయిన తర్వాత అవ్వస్థతకు గురయ్యే వారిని కాపాడే అవకాశం ఉంటుంది.

ఆస్పత్రి ఓ చోట.... సీసీయూ మరో చోట

క్రిటికల్ కేర్ యూనిట్స్‌ను సాధారణంగా ప్రధాన ఆస్పత్రులకు అనుబంధంగా నిర్మిస్తుంటారు. జిల్లాకు 250 పడకల ఆస్పత్రిని మంజూరు చేసిన కేంద్రం దానికి అనుసంధానంగా 50 పడకలతో క్రిటికల్ కేర్ యూనిట్‌ను మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో 250 పడకల ఆస్పత్రి పనులు పూర్తికాగా క్రిటికల్‌కేర్ యూనిట్ పనులు కొనసాగుతున్నాయి. ఇక్కడి వరకు అంత బాగానే ఉంది. అయితే.. 2022లో జిల్లాకు 250 పడకల ఆస్పత్రి మంజూరైతే 2023లో ప్రభుత్వ మెడికల్ కాలేజీని రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేయడంతో అసలు సమస్య మొదలైంది. మెడికల్ కాలేజీ తరగతులను తాత్కలికంగా 250 పడకల ఆస్పత్రి భవనంలో 2023 సెప్టెంబరులో ప్రారంభించారు. మెడికల్ కాలేజీ ప్రారంభమై మూడేళ్లు కావస్తోంది. అయినా ఇప్పటి వరకు శాశ్వత మెడికల్ కాలేజీ పనులు ప్రారంభం కాలేదు. ఇటీవల విద్యార్థుల హాస్టల్స్ నిర్మాణాలు మాత్రమే ప్రారంభమయ్యాయి. అయితే.. జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రిని జీజీహెచ్ (ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి)గా అప్‌గ్రేడ్ చేశారు. జీజీహెచ్ సామర్థ్యం పెంచుకుంటూపోతున్న ప్రభుత్వం ఇటీవల 200 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతో పాటు రూ. 13కోట్లతో ఆస్పత్రి భవనంపై 90 పడకల అదనపు నిర్మాణం ప్రారంభించింది. మరోవైపు శాశ్వత మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు ప్రారంభం కాకపోవడం, క్రిటికల్ కేర్ యూనిట్ పనులు పూర్తి కావస్తుండటంతో ఏంచేయాలో తెలియక వైద్యులు తలలు పట్టుకుంటున్నారు. ఆస్పత్రి సమూదాయంలో ఉండాల్సిన క్రిటికల్‌కేర్ యూనిట్ అక్కడెక్కడో దూరంలో ఉంటే అత్యవసర పరిస్థితుల్లో ఉన్న వారికి సేవలు ఏవిధంగా అందుతాయనేది ప్రశ్నార్థకంగా మారింది.



250 పడకల ఆస్పత్రి భవనంలో నిర్వహిస్తున్న మెడికల్ కాలేజీ

మెడికల్ కాలేజీ నిర్మాణామెప్పుడో..?

గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ మెడికల్ మంజూరైంది. 2023 ఎన్నికల ముందు రూ. 100 కోట్ల పైచిలుకుతో రామప్ప క్వార్టర్స్ పక్కన 20 ఎకరాల విస్తీర్ణంలో విద్యార్థులకు తరగతి గదులు, హాస్టల్స్, ల్యాబ్స్ అధ్యాపకులకు క్వార్టర్స్‌తో నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతులు వచ్చాయి. ఆ ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఓడిపోయి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ప్రభుత్వం మారి దాదాపు 20 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు హాస్టళ్ల నిర్మాణం మాత్రమే ప్రారం భం కావడం, మిగిలిన నిర్మాణాలు ప్రారంభం కాకపోవడం విమర్శలకు తావిస్తోంది. శాశ్వత మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు పూర్తి స్థాయిలో ప్రారంభమైతే తాత్కాలిక తరగతులు నిర్వహిస్తున్న 250 పడకల ఆస్పత్రిలో ప్రజలకు వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయి. తద్వారా అక్కడే నిర్మిస్తున్న క్రిటికల్‌కేర్ యూనిట్ సేవలు కూడా పూర్తి స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉంటాయి. పాలకులు ఇప్పటికైనా శాశ్వత మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టడంతోపాటు 250 పడకల ఆస్పత్రికి అనుసంధానంగా క్రిటికల్‌కేర్ ఉంటేనే ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని జిల్లా ప్రజలు అంటున్నారు.

చిత్త శుద్ధిలేని పాలకులు



మా హయాంలో జిల్లాను వైద్యరంగంగా అభివృద్ధి చేశాం. ప్రభుత్వ మెడికల్ కాలేజీ, ఆయుష్ హాస్పిటల్, 250 పడకల ఆస్పత్రి, క్రిటికల్ కేర్ యూనిట్‌ను మంజూరు చేయించుకున్నాం. శాశ్వత మెడికల్ కాలేజీ క్యాంపస్ నిర్మాణానికి అనుమతులు కూడా సాధించుకున్నాం. కానీ ప్రస్తుత పాలకులు మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని పక్కన పెట్టారు. ఆస్పత్రికి అనుసంధానంగా ఉండాల్సిన క్రిటికల్‌కేర్ యూనిట్ ఆస్పత్రికి దూరంగా ఉండటంతో రోగులకు, వైద్యులకు ఇబ్బంది అవుతుంది. వెంటనే శాశ్వత మెడికల్ కాలేజీ నిర్మాణం చేపట్టి, 250 పడకల ఆస్పత్రిని ప్రజలకు అందుబాటులో తేవాలి.

- గండ్ర వెంకటరమణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే

250 పడకల ఆస్పత్రికి అనుసంధానం చేయాలి



క్రిటికల్ కేర్ యూనిట్ పనులు పూర్తి కావస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే శాశ్వత మెడికల్ కాలేజీ పనులు ప్రారంభించి, పూర్తి చేసి. 250 పడకల ఆస్పత్రికి సీసీయూను అనుసంధానం తేవాలి. దీంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయి. లేదంటే కేంద్రం కేటాయించిన నిధులు వృథా అయినట్టే.

- దొంగల రాజేందర్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎంజేఎస్ జిల్లా కమిటీ ఎన్నిక



సాగర్



సాంబశివన్

ఏటూరునాగారం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మాదిగ జాగృతి సంఘం (ఎంజేఎస్) ములుగు జిల్లా నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన సమావేశంలో జె.కరుణాకర్ సమన్వ యకర్తగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీని సంఘం రాష్ట్ర కార్యదర్శి సాంబ య్య ప్రకటించారు. అధ్యక్షుడిగా పనుల సాగర్, ప్రధాన కార్యదర్శిగా వాసంపల్లి సాంబశివన్, ఉపాధ్యక్షుడుగా కోకిల అజయ్ కుమార్, సభ్యుడిగా కాకి సతీష్‌ను ఎన్నుకున్నారు.

రెగ్యులర్ డీఈవోను నియమించాలి : ఏఐఎస్ఎఫ్

ములుగు టౌన్, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): జిల్లాకు రెగ్యులర్ విద్యాశాఖాధికారి (డీఈవో)ను నియమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి కుమ్మరి సాగర్ డిమాండ్ చేశారు. ములుగులోని గాంధీ పార్కులో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెగ్యులర్ డీఈవో లేకపోవడంతో విద్యారంగ సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయి డీఈవోను నియమిం చాలన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి యానయ్య

మంగపేట, సెప్టెంబరు, 7 (ఆంధ్రజ్యోతి) మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని కాంగ్రెస్ జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య అన్నారు. మండలంలోని కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం యర్రంకాని సురేష్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా యానయ్య హాజరయ్యారు. మహిళలకు కాంగ్రెస్ అత్యధికంగా ప్రాధాన్యమిస్తోందని అన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. అనంతరం మహిళా కాంగ్రెస్ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా తిమ్మంపేటకు చెందిన శానం నిర్మల, ప్రధాన కార్యదర్శిగా చింతా చంద్రావతిని ఎన్నుకున్నారు. ఈకార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు మద్దాలి నాగమణి, ములుగు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగా కల్యాణి, ఏటూరునాగారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు గీకురు భాగ్య, జిల్లా ఉపాధ్యక్షురాలు కటుకూరి రాధిక, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మైల జయరామిరెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లాల ప్రచార కార్యదర్శి పూజారి సురేందర్‌బాబు, మంగపేట మాజీ జడ్పీటీసీ సిద్దంశెట్టి వైకుంఠం, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చెట్టుపల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తున్న ఏఎస్సైకు సన్మానం



ఏఎస్సై సుబ్బారావును సన్మానిస్తున్న సీఐ, ఎస్సైలు

ఏటూరునాగారం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఏటూరునాగారం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఏఎస్సై సుబ్బారావు భద్రాది కొత్తగూడెం జిల్లాకు బదిలీ అయ్యారు. ఈసందర్భంగా ఆయనకు సిబ్బంది సీఐ అనుముల శ్రీనివాస్, ఎస్సై రాజ్‌కుమార్‌ఆదివారం ఘనంగా సన్మానించారు. సుబ్బారావు అందించిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. అలాగే జామా మసీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ అఫ్జల్ పాషా ఆధ్వర్యంలో సభ్యులు సన్మానించారు.

పంట నష్టం పోరాటాన్ని రాజకీయంగా భావించొద్దు

గిరిజనేతరుల సంఘం రాష్ట్ర నాయకుడు బాబూరావు

తాడ్వాయి, సెప్టెంబరు 7(ఆంధ్రజ్యోతి): పంట నష్టపరిహార సాధన సమితి చేస్తున్న పోరాటాన్ని రాజీయంగా భావించొద్దని, దాన్ని ఆ కోణంతో చూడొద్దని ఏజెన్సీ ప్రాంత గిరిజనేతరుల సంఘం రాష్ట్ర నాయకుడు జీడి బాబురావు ఆదివారం ప్రకటనలో హితవు పలికారు. మేడారం సమ్మక్క-సారలమ్మల మహా జాతరకు, అభివృద్ధి పనుల కోసం మేడారంతో పాటుగా పరిసర గ్రామాల రైతుల పంట పొలాలకు 30 ఏళ్లుగా నష్టం వాటిల్లుతోందని తెలిపారు ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం కూడా నష్టపరిహారం చెల్లించలేదని పేర్కొన్నారు. రైతులను చైతన్య వంతం చేసి ముందుకెళ్తున్న పంట నష్టపరిహార సాధన సమితి పోరాటాన్ని రాజకీయ కోణంలో చూడ్డం సరికాదని సూచించారు. అన్నదాతలకు అన్యాయం చేయొద్దని రాజకీయ పార్టీల నాయకులను కోరుకుంటున్నానని పేర్కొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కమలాపూర్ మాజీ సర్పంచ్ తోట సంతోష్ అన్నారు గ్రామంలోని చెరువును రైతులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులను అత్యున్నత స్థానంలో ఉంచడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తమ గ్రామంలోని చెరువుకు అత్యధిక నిధులు వెచ్చించి మరమ్మతులు చేయించారని అన్నారు. ఈ క్రమంలో ఇప్పుడు ఈ చెరువు ద్వారా రెండు పంటలు పండే పరిస్థితి నెలకొందని అన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు అబ్బినేని అంజయ్య, మాజీ ఎంపీటీసీ సముద్రాల దీపారాణి శ్రీనివాస్, నాయకులు బుర్ర స్వామి, రైతులు సమ్మయ్య, సాంబయ్య తదితరులు ఉన్నారు.

బైక్‌ను ఢీకొన్న కారు.. ఒకరికి గాయాలు

కృష్ణకాలనీ, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ఈ సంఘటన భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. భూపాలపల్లి పట్టణంలోని సుభాష్‌కాలనీకి చెందిన కొండయ్య ద్విచక్ర వాహనంపై మంజూర్‌నగర్ నుంచి భూపాలపల్లికి వస్తున్నాడు. ఈ క్రమంలో వెనకాల సింగరేణి ఏరియాలో పని చేస్తున్న ఓ అధికారి కారులో వస్తూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. దీంతో ద్విచక్ర వాహనదారుడు కొండయ్య కిందపడిపోగా కాలుకు , తలకు గాయాలయ్యాయి. కారు ముందు భాగం ధ్వంసమైంది. క్షతగ్రాతుడిని పట్టణంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అతడి పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు తెలిసింది.

లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలి

ఏటూరునాగారం, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి): లంబాడీలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని ఆదివాసీ సంఘాలు డిమాండ్ చేశాయి. అప్పటి వరకు తమ ఉద్యమం ఆగదని తేల్చిచెప్పాయి. ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని బీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివాసీ సంఘాల అత్యవసర సమావేశం ఆదివారం జరిగింది. ఆదివాసీ ఉద్యమ నేత పొదెం కృష్ణ ప్రసాద్ దీనికి అధ్యక్షత వహించారు. సుప్రీంకోర్టు న్యాయవాది అర్రెం పాపారావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సుప్రీంకోర్టు తెలంగాణ ప్రభుత్వాన్ని లంబాడీలు 1976 నుంచి ఎస్టీలుగా ఉన్నారా లేదా అనే అంశంపై వివరాలు కోరిందని, దీంతో భద్రచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు, మాజీ ఎంపీ సోయం బాబురావు ఈ విషయంపై పిటిషన్ దాఖలు చేశారని తెలిపారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత లంబాడీలను ఎస్టీ రిజర్వేషన్లు వర్తించవని, కేవలం జీవో ద్వారానే వారు 48 ఏళ్లుగా కొనసాగుతున్నారని అన్నారు. 1976లో కాంగ్రెస్ అక్రమంగా లంబాడీలను ఎస్టీల్లో చేర్పిందని, దీనివల్ల ఆదివాసీలు తీవ్రంగా అన్యాయానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పుడు వాస్తవాలను సుప్రీంకోర్టుకు వినిపించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉందని పేర్కొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్ నుంచి వలస వచ్చిన లంబాడీలు ఆదివాసీల అస్తిత్వాన్ని దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. 1950 భారత రాజ్యాంగంలోని ఆర్టికర్ 342కు వ్యతిరేకంగా వీరిని ఎస్టీ జాబితాలో కొనసాగిస్తున్నారని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో చర్చలు జరిపి ఆదివాసీలకు న్యాయం జరిగేలా మంత్రి సీతక్క చొరవ చూపాలని కోరారు. ఉద్యమాన్ని ఉధృతం చేసేందుకు ఈనెల 9న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆదివాసీ సంఘాల నేతలు నిర్ణయించారు. ఈ సమావేశంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్ కుమార్, జాతీయ కోకన్వీనర్ పొదెం రత్నం, నవ నిర్మాణ సేవ రాష్ట్ర అధ్యక్షుడు కోర్స నర్సింహమూర్తి, ఏఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నాను విజయవంతం చేయాలి

చిట్యాల, సెప్టెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వృద్ధులు, వితంతు, దివ్యాంగులకు పెన్షన్ పెంపును వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ భూపాలపల్లి కలెక్టరేట్ వద్ద సోమ వారం నిర్వహించే మహాధర్నా విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ జిల్లా నాయకుడు నేరెళ్ల ఓదెలు కోరారు. మండలంలోని చల్లగరిగ, జూకల్లు, అందుకుతండా, ఒంటిప్పతం డా తదితర గ్రామాల్లో మండల అధ్యక్షుడు దొడ్డె శంకర్ ఆధ్వ ర్యంలో మహాధర్నా సన్నాహక సమావేశం ఆదివారం నిర్వ హించారు. ఈసందర్భంగా ఓదెలు మాట్లాడుతూ కలెక్టర్ కార్యా లయం ఎదుట చేపట్టే మహాధర్నాకు అన్ని వర్గాల ప్రజలు, పెన్షన్ దారులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ సమా వేశంలో నాయకులు జేరిపోతుల ఓదెలు, మున్నీర్, ఐలయ్య, దూడ పాక రాజు, దివాకర్, వంశీ, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్‌దారులు కలెక్టరేట్ వద్దకు రావాలి

టేకుమట్ల (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి కలెక్టర్ ఎదుట సోమవారం నిర్వహించనున్న చేయూత పెన్షన్‌దారుల మహాధర్నా కార్యక్ర మాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు రాం రాంచందర్ మాదిగ కోరారు. పెన్షన్‌దారులంతా కలెక్టర్ వద్దకు భారీ సంఖ్యలో రావాలని విజ్ఞప్తిచేశారు. మండలంలోని రామకిష్టాపూర్(వి) గ్రామంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు రేణుకుంట్ల శంకర్ ఆధ్వ ర్యంలో ఆదివారం నిర్వహించిన వికలాంగుల కమిటీ సమావేశానికి రాం చందర్ హాజరై మాట్లాడారు. చేయూత పెన్షన్‌దారులైన వికలాం గులకు, వృద్ధులకు, వితంతువులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని విస్మరించిందని విమర్శించారు. ఇచ్చిన మాట ప్రకారం పింఛను పెంచాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించే ధర్నాకు అన్ని గ్రామాల నుంచి చేయూత పెన్షన్‌దారులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వికలాంగుల సంఘం మండల నాయకులు, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.